# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 29-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ పార్లమెంట్ ఉభయ సభల్లో ఆపరేషన్ సింధూర్ పై చర్చ కొనసాగుతోంది.

❖ ఆపరేషన్ మహాదేవ్ లో భాగంగా పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను భారత సైన్యం హతమార్చిందని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ప్రకటించారు.

❖ పహల్గాం దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను హతమార్చినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశ విద్యా వ్యవస్థకు జాతీయ విద్యా విధానం 2020 మార్గనిర్దేశనం చేస్తోందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

❖ ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడానికి గత పది సంవత్సరాలలో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ ఉభయ సభల్లో “ఆపరేషన్ సింధూర్”పై చర్చ కొనసాగుతోంది. ఈరోజు రాత్రి 10 గంటల వరకూ ఉభయ సభల్లోనూ చర్చా సమయాన్ని పొడిగించారు. అంతకుముందు రాజ్యసభలో ప్రతిపక్షాల ఆందోళనల కారణంగా డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత సమావేశమైన వెంటనే, జీరో అవర్‌ను నిర్వహించడానికి ప్రయత్నించినప్పటికీ, వివిధ అంశాలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ.. ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడంతో అంతరాయం ఏర్పడింది. వివిధ అంశాలకు సంబంధించి పలు రాజకీయ పార్టీల నుండి తనకు 24 వాయిదా నోటీసులు వచ్చాయని, అయితే తీర్పు కారణంగా ఆ నోటీసులను తిరస్కరించామని డిప్యూటీ చైర్మన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్‌సభలో ఈరోజు ఉదయం "ఆపరేషన్ సిందూర్"పై చర్చను తిరిగి ప్రారంభించారు. చర్చలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, భారత సైన్యం, CRPF, జమ్మూ కాశ్మీర్ పోలీసులు నిన్న సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ మహాదేవ్ లో పహల్గామ్ ఉగ్రదాడికి కారణమైన ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చారని ప్రకటించారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ఉపయోగించిన మూడు రైఫిళ్లను కూడా భారత సాయుధ దళాలు స్వాధీనం చేసుకున్నాయని చెప్పారు. ఆపరేషన్ మహాదేవ్ పూర్తి వివరాలను అమిత్ షా ఈ సందర్భంగా వెల్లడిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

ఇదిలా ఉండగా మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఆగస్టు 13 నుండి మరో ఆరు నెలల పాటు పొడిగించే తీర్మానాన్ని పరిశీలించడానికి బిజినెస్ అడ్వైజరీ కమిటీ రెండు గంటల సమయాన్ని కేటాయించింది. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ఈరోజు రాజ్యసభలో ఈ విషయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను పొడిగించడానికి హోంమంత్రి అమిత్ షా ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో రాజ్యసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పహల్గాం దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను హతమార్చినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో ఈరోజు జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ... మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే పహల్గాం దాడులకు పాల్పడ్డారని అన్నారు. ఆ రోజే ఉగ్రవాదులను మట్టిలో కలుపుతామని ప్రతినబూనామని గుర్తు చేశారు. ద్రోహులకు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తామని పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి మరీ ఉగ్రస్థావరాలని ధ్వంసం చేశామన్నారు. 193 దేశాల్లో 190 దేశాలు ఆపరేషన్ సిందూర్‌ని సమర్థించాయని.. పాకిస్థాన్ మళ్లీ ఎలాంటి కుయుక్తులు చేసినా ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణరంగ పరిశోధన సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి "ప్రళయ్" ప్రయోగ పరీక్షలు విజయవంతమయ్యాయి. ఈ క్షిపణి అత్యధిక, అత్యల్ప సామర్థ్యాలను అంచనా వేయడానికి ఒడిశాలోని అబ్దుల్ కలామ్ ద్వీపంలో నిన్నటి నుండి వరుసగా దీనిని పరీక్షించారు. డీఆర్‌డీవో వెల్లడించిన వివరాల ప్రకారం రెండు పరీక్షల్లోనూ ఈ క్షిపణి అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించడంతో పాటూ నిర్దేశిత ప్రమాణాలను కూడా చేరుకొంది. కాగా యుద్ధ క్షేత్రంలో నేరుగా వినియోగించేందుకు వీలుగా దీనిని రూపొందించారు. ఇది 150 నుంచి 500 కిలోమీటర్ల లోపు లక్ష్యాలను ఛేదించగలదు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశ విద్యా వ్యవస్థకు జాతీయ విద్యా విధానం 2020 మార్గనిర్దేశనం చేస్తోందని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో యూజీసీ నిర్వహించిన అఖిల భారతీయ శిక్షా సమాగం 2025 ప్రారంభ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ... జాతీయ విద్యా విధానం (NEP) 2020 భారతీయ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. 2047 వికసిత్ భారత్ దార్శనికతను సాధించడానికి ఇది అత్యంత ముఖ్యమైన మార్గమని పేర్కొన్నారు. ఈ నూతన జాతీయ విద్యా విధానాన్ని తరగతి గదుల నుండి విశ్వ విద్యాలయాల వరకూ తీసుకువెళ్లడంలో ప్రభుత్వం సఫలీకృతమయ్యిందని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడానికి గత పది సంవత్సరాలలో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈరోజు లోక్‌సభలో ప్రశ్నోత్తరాలకు ఆయన సమాధానమిస్తూ... 2013-2014లో 246 మిలియన్ టన్నులగా ఉన్న ఆహార ధాన్యాల ఉత్పత్తి నేడు 353 మిలియన్ టన్నులకు పెరిగిందన్నారు. పప్పుధాన్యాల ఉత్పత్తి కూడా 16 మిలియన్ టన్నుల నుండి 25 మిలియన్ టన్నులకు పెరిగిందని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల ఆదాయాన్ని పెంచడానికి ప్రభుత్వం పలు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని శివరాజ్ సింగ్ చౌహాన్ వివరిస్తూ ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో నిన్న రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఒక్కరూ గల్లంతయ్యారు. ఈ భారీ వర్షాల కారణంగా విస్తృతంగా వరదలు, కొండచరియలు విరిగిపడటంతో మౌలిక సదుపాయాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో జన జీవనం స్తంభించింది. ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ ఈ విషాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆగస్టు 4 వరకు ఆ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ సంవత్సరం జూన్ 30 నాటికి ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన పథకం కింద మొత్తం 16 వేల 912 జన ఔషధి కేంద్రాలను ప్రభుత్వం స్థాపించిందని కేంద్ర రసాయనాల, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. రాజ్యసభలో ఈరోజు ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా, మార్చి 2027 నాటికి 25 వేల జన ఔషధి కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =